
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 39.7 । కనిష్ఠం 25.9
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
బుధవారం 14 మే 2025



## విరబూసిన మే పుష్పం



కామారెడ్డి టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): సంవత్సరానికి ఒక్కసారి పూసి కనువిందు చేసే మే పుష్పం ప్రముఖ రచయిత సిరిగాద శంకర్ ఇంట్లో విరబూసింది. కవితలు, రచనలతో పాటు పచ్చదనాన్ని పర్యవేక్షించాలని ఆయన అనేక సమావేశాల్లో చెబుతూ వస్తుంటారు. ప్రస్తుతం ఆయన ఇంట్లో పెట్టిన మొక్కలకు మే పుష్పం విరగ బూయడంతో కాలనీవాసులు వచ్చి వీక్షిస్తున్నారు.



# సన్నాలకు.. బోనస్ ఏదీ?



- జిల్లాలో సన్న రైతులకు అందని బోనస్
- కొనుగోళ్లు మొదలైనప్పటి నుంచి రైతుల ఖాతాలో జమకాని బోనస్ నిధులు
- ప్రభుత్వం నుంచే విడుదల కాని నిధులు
- జిల్లా వ్యాప్తంగా రూ.82 కోట్ల పెండింగ్
- 19,609 మంది రైతులకు తప్పని నిరీక్షణ
- జిల్లాలో వేగంగా ధాన్యం కొనుగోళ్లు
- ఇప్పటి వరకు 3.10 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు

కామారెడ్డి, మే 13(ఆంధ్రజ్యోతి): వరిలో సన్న రకం పండించే రైతులకు క్వింటాల్‌కు రూ.500ల బోనస్ అదనంగా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా యాసంగి సీజన్‌లో జిల్లాలో అత్యధిక మంది రైతులు సన్నాల సాగుకే మొగ్గు చూపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పెద్ద ఎత్తున సన్న రకం ధాన్యం వస్తోంది. అయితే రైతులు తమ ధాన్యాన్ని విక్రయించి 25 రోజులు గడుస్తున్నా బోనస్ డబ్బులు మాత్రం వారి బ్యాంక్ ఖాతాలో జమ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 1,67,299 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించిన రూ.82 కోట్లు బోనస్ ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. దీంతో ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా క్వింటాల్‌కు రూ.500ల బోనస్ డబ్బులు ఎప్పుడు ఖాతాలో పడుతాయోనని రైతులకు నిరీక్షణ తప్పడం లేదు.

### యాసంగిలో పెరిగిన సన్నాల సాగు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో సన్న రకం వరి సాగు ఈ యాసంగి సీజన్‌లో భారీగా పెరిగింది. సాధారణంగా ఇక్కడి రైతులు వానాకాలం సీజన్‌లో సన్నాలు, యాసంగిలో దొడ్డు రకం పండించేవారు. అయితే ప్రభుత్వం సన్నాలకు రూ.500ల చొప్పున బోనస్ ఇస్తామని ప్రకటించడంతో యాసంగి సీజన్‌లోనూ రైతులు సన్నాల సాగుకే మొగ్గు చూపారు. జిల్లాలో ఇప్పటి వరకు 3,10,014 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఇందులో 1,67,299 మెట్రిక్ టన్నుల సన్నాలే కావడం గమనార్హం. సన్నాలే ఎక్కువగా కొనుగోలు కేంద్రాలకు వచ్చాయి. అయితే కేవలం రెండు రోజుల్లోనే రైతులకు పూర్తిస్థాయిలో ధాన్యం డబ్బులు పడతాయని అధికారులు చెబుతున్నా ఎక్కడ అమలు కావడం లేదు. కనీసం మద్దతు ధర ప్రకారం ధాన్యం డబ్బులు జమ అయ్యేందుకు దాదాపు వారం రోజులు పడుతుండగా రూ.500ల చొప్పున ప్రభుత్వం ఇచ్చే బోనస్ డబ్బులు 25 రోజులు దాటినా పడడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి సకాలంలో బోనస్ డబ్బులు ఖాతాలో జమ చేయాలని వేడుకుంటున్నారు.

### పెండింగ్‌లో రూ.82 కోట్ల బోనస్ డబ్బులు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమై 25 రోజులు గడుస్తోంది. దాదాపు ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరాయి. అయినప్పటికీ బోనస్ డబ్బులు మాత్రం పడడం లేదని రైతులు మండిపడుతున్నారు. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 1.67 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో ఇప్పటి వరకు 1.48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి 19,609 మంది రైతులకు మద్దతు ధర డబ్బులను ఆయా రైతుల ఖాతాలో జమ చేశారు. కానీ బోనస్ రూ.82 కోట్లు మాత్రం పెండింగ్‌లో ఉంచారు. ధాన్యం కొనుగోలు చేసిన కేవలం రెండు రోజుల్లోనే పూర్తిస్థాయిలో డబ్బులు రైతుల ఖాతాలో పడుతాయని ప్రభుత్వం చెబుతోంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం భిన్నంగా కనిపిస్తోంది. ధాన్యం కొనుగోలు చేసి 25 రోజులు గడుస్తున్నా బోనస్ డబ్బులు మాత్రం పడడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి బోనస్ అమలు చేస్తుందా లేదా అని అయోమయానికి గురవుతున్నారు.

### రూ.719 కోట్ల విలువ చేసే ధాన్యం కొనుగోలు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.719 కోట్ల విలువ చేసే 3,10,014 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 57,087 మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఇందులో ఇప్పటి వరకు 38,394 మంది రైతుల ఖాతాలో రూ.578.25 కోట్ల ధాన్యం డబ్బులను జమ చేశారు. గత యాసంగి సీజన్‌తో పోలిస్తే ఈసారి 34 శాతం అధికంగా ధాన్యం కొనుగోలు చేసినట్లు సంబంధితశాఖ అధికారులు చెబుతున్నారు. ధాన్యం కొనుగోళ్లలో జిల్లా రాష్ట్రవ్యాప్తంగా మూడో స్థానంలో ఉండగా ధాన్యం డబ్బులు చెల్లించడంలోనూ రెండో స్థానంలో ఉంది. బాన్సువాడ డివిజన్‌లో 95,561 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా జుక్కల్‌లో 63,297 మెట్రిక్ టన్నులు, ఎల్లారెడ్డిలో 93,270 మెట్రిక్ టన్నులు, కామారెడ్డిలో 57,890 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. జిల్లావ్యాప్తంగా 446 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా బాన్సువాడ, జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలో 189 కేంద్రాల్లో కొనుగోలు పూర్తవడంతో వాటిని మూసివేశారు. మరో 15 రోజుల్లో కొనుగోళ్లు దాదాపు పూర్తవుతాయని 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని పౌర సరఫరాలశాఖ అధికారులు చెబుతున్నారు.

### బోనస్ డబ్బులు అందలేదు

**• బాలరాజు, బీర్కూర్**

బీర్కూర్ శివారులో 3 ఎకరాలు కౌలుకు తీసుకుని యాసంగిలో సన్న రకం వరి పంటను సాగు చేశాను. 60 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చాయి. గత 15 రోజుల కిందట బీర్కూర్ ప్రభు త్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని విక్రయించాం. మద్దతు ధర ధాన్యం డబ్బులు ఖాతాలో జమ చేశారు. కానీ బోనస్ డబ్బులు మాత్రం జమ కాలేదు. బోనస్ డబ్బులను ప్రభుత్వం అందించాలి.

### ప్రభుత్వం నుంచే రావాల్సి ఉంది

**• రాజేందర్, పౌర సరఫరాల శాఖ డీఎం**

సన్న రకం ధాన్యానికి సంబంధించి బోనస్ డబ్బులు ప్రభుత్వం నుంచే రావాల్సి ఉంది. జిల్లాలో 3.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా 38,394 మంది రైతుల ఖాతాలో రూ.578 కోట్ల ధాన్యం డబ్బులను జమ చేశాం. ఇందులో సన్న రకం 1.67 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం. ఇందుకు సంబంధించిన బోనస్ డబ్బులు రూ.82 కోట్లు అవుతాయి. దీనికి సంబంధించి ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయడంతో పాటు ప్రభుత్వానికి పంపాం. ప్రభుత్వం బోనస్ నిధులు విడుదల చేస్తే కామారెడ్డి జిల్లాకే మొదటి ప్రాధాన్యత ఉండవచ్చు.

# కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదోడి సొంతింటి కల సాకారం



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

ఎల్లారెడ్డి, మే 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదోడి సొంతింటి కల సాకారమైందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఏడవ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.

### ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో పేదోడి సొంత ఇంటి కలగానే మిగిలిపోయిందని గత పాలకుల అసమర్థత వల్లనే ఎల్లారెడ్డి నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించలేదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల వ్యవధిలోని నియోజకవర్గానికి 3,500 డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు అయ్యాయని అన్నారు. విడతల వారీగా మిగతా వారికి కూడా మంజూరు అవుతాయని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. అంతకుముందు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని దేవి హాస్పిటల్‌లో గైనకాలజిస్ట్, ఐసీయూ, విభాగాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఆస్పత్రి సిబ్బందికి తెలిపారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వినోద్ గౌడ్, మండల అధ్యక్షుడు సాయిబాబా, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత రెడ్డి, నాయకులు వెంకట్రాంరెడ్డి, సామెల్, శ్రీనివాస్ రెడ్డి, విద్యాసాగర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### అంబలి కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనా రాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రజలకు కార్యకర్త లకు అంబలి అందిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో బాటసారుల దాహార్తి తీర్చడం కోసం అంబాలి కేంద్రం ఏర్పాటు చేయడం పట్ల సత్యనారాయణను ఎమ్మెల్యే అభినందించారు.

# సప్లిమెంటరీ పరీక్షలను.. పకడ్బందీగా నిర్వహించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): ఇంటర్, పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణపై ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ మీడియట్ సప్లిమెంటరి పరీక్షలు ఈనెల 22 నుంచి 29 వరకు 30 కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుండి 5.30 వరకు నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో మొదటి సంవత్సరం 5,088 మంది విద్యార్థులు, రెండో సంవత్సరం 3,873 మంది విద్యార్థులు హాజరవనున్నట్లు తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 3 నుంచి 6 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పదో తరగతి విద్యార్థులకు 3 కేంద్రాల్లో జూన్ 3 నుంచి 13 వరకు ఉదయం 9.30 నుంచి 12.30 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆయా పరీక్షల నిర్వహణకు అవసరమైన ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండె ంట్లను నియమించుకోవాలని తెలిపారు. పరీక్షలు జరిగే సమయం లో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని, కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ యాక్టు అమలు చేయాలని తెలిపారు. పరీక్ష కేం ద్రాల్లోకి ఎవరికి కూడా సెల్‌ఫోన్ అనుమతించబోమని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఇంటర్ నోడల్ అధికారి సలాం, డీఈవో రాజు, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్, ఆర్టీసీ డీఎం కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

### ఆరుగురు విద్యార్థులను అభినందించిన కలెక్టర్

బాలసదనంలో ఉంటూ పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులైన 6 గురు పిల్లలను జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ మంగళవారం అభినందించారు. విద్యార్థులు ఇదే సంకల్పంతో ఉన్నత స్థానాల్లో ఉండి ప్రజలకు మంచి సేవలను అందించాలని కోరుతున్నామన్నారు.

### ఉపాధ్యాయులు శిక్షణ పొంది విద్యార్థులకు సులువైన ఆంగ్లం బోధించాలి

**సదాశివనగర్:** కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇంగ్లీష్‌పై పూర్తి శిక్షణ పొంది విద్యార్థులకు సరళంగా ఆంగ్లబోధన చేయాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. సదాశివనగర్ ఆదర్శ పాఠశాలలో కెపాసిటీ బిల్డింగ్‌పై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి మంగళవారం హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఆంగ్ల భాషలో మాట్లాడటం, రాయడం, రీజనింగ్ సులభతరం చేయడానికి ఈ కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఐదు రోజులు నిర్వహించే ఈ శిక్షణలో ఉపాధ్యాయులు బాగా నేర్చుకుని విద్యార్థులకు ఉపయోగపడే విధంగా పాఠశాలల్లో బోధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, ఎంఈవో యోసఫ్, తహసీల్దార్ గంగాసాగర్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) మూలవిరాట్టు

## కాలభైరవ స్వామి ఆలయంలో వైశాఖ పూజలు

రామారెడ్డి, మే 13 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండల కేంద్రం - ఇసన్నపల్లి గ్రామాల మధ్య వెలసిన దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైశాఖమాసం మూడవ మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ గర్భగుడిలో ఆలయ పురోహితులు శ్రీనివాస్ శర్మ మంత్రోచ్చారణలతో సంతతధారాభిషేకం, క్షీరాభిషేకం, సింధూర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఓం భైరవ.. ఓంఓం భైరవ.. ఓం శ్రీ కాలభైరవ స్వామి అంటూ ప్రత్యేక పూజలు, పాటలు, యజ్ఞం, జెండా ఆవిష్కరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఉన్న బావి వద్ద స్నానాలు చేసి తడి బట్టలతో దేవున్ని దర్శించుకుని మూల విరాట్టును అభిషేకించారు. వివిధ రకాల పూజలు నిర్వహించి 108 రకాల కూరగాయలతో దేవున్ని అలంకరించారు. భక్తులు రూ. 8,655 దండ రూపంలో విరాళంగా అందజేశారు. కామారెడ్డి జిల్లాతో పాటు నిజామాబాద్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, మెదక్, పెద్దూరు, సిద్దిపేట, జగిత్యాల తదితర జిల్లాల భక్తులు అధిక సంఖ్యలో హాజరైన మొక్కలు చెల్లించుకున్నారు. శనేశ్వర ఆలయం, నాగ దేవతకు, తొమ్మిది దేవుళ్ల విగ్రహాలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ప్రత్యేక క్యూ లైన్ ద్వారా దేవున్ని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ బుర్ర ప్రభు రాంచంద్రం గుప్తా, ఆలయ మాజీ చైర్మెన్‌లు దోమకొండ శ్రీనివాస్ గుప్తా, గంజి సతీష్ గుప్తా, రాజకీయ నాయకులు, వ్యాపారులు, వైద్యులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, సిబ్బంది నాగరాజు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పాలిసెట్ పరీక్ష



పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

కామారెడ్డి టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పాలిసెట్ ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 11 గంటల నుంచి 1.30 వరకు పరీక్ష నిర్వహణ చేపట్టారు. నిమిషం నిబంధన అమలులో ఉండడంతో 10 గంటల నుంచే అభ్యర్థులను లోనికి అనుమతించి 11 దాటిన తర్వాత ఎవరిని అనుమతించలేదు. మొత్తం 2,900 మంది అభ్యర్థులకు 6 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 2,766 మంది పరీక్షకు హాజరవ్వగా 134 మంది గైర్హాజరయ్యారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో 600 మంది పరీక్షకు హాజరవ్వాల్సి ఉండగా 577 మంది హాజరయ్యారు. కేంద్రం బీలో 600 మంది హాజరవ్వాల్సి ఉండగా 584 మంది హాజరయ్యారు. ఎస్ఆర్‌కే డిగ్రీ కళాశాల కేంద్రంలో 300 మంది అభ్యర్థులు హాజరవ్వాల్సి ఉండగా 292 మంది హాజరయ్యారు. సాందీపని డిగ్రీ కళాశాల కేంద్రం ఏలో 500 మంది హాజరవ్వాల్సి ఉండగా 475 మంది, కేంద్రం బీలో 400 మంది హాజరవ్వాల్సి ఉండగా 377 మంది, శ్రీఆర్యభట్ట జూనియర్ కళాశాల కేంద్రంలో 500 మంది అభ్యర్థులు హాజరవ్వాల్సి ఉండగా 461 మంది హాజరయ్యారు. పలు పరీక్ష కేంద్రాలను ఎస్పీ రాజేష్‌చంద్ర పర్యవేక్షించారు. పరీక్ష పకడ్బందీగా సాగేలా సిబ్బంది చూడాలని ఎక్కడా నిర్లక్ష్యానికి తావివ్వద్దని తెలిపారు.

## 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

కామారెడ్డి టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): ఈనెల 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 11 సంవత్సరాల బీజేపీ ప్రభుత్వ పాలనలో కార్మికుల జీవన ప్రమాణాలు పడిపోయాయని తెలిపారు. అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగాయని కార్మికుల జీతాలు మాత్రం పెరగలేదన్నారు. కార్మికులకు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కరువైందని, మోదీ ప్రభుత్వం అవలంబించిన కార్పొరేట్ కంపెనీల అనుకూల, కార్మిక వ్యతిరేక విధానాలే ఇందుకు కారణమన్నారు. కనీస వేతనాల అమలు కోసం, పని గంటల పెంపుదలకు నిరసనగా నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, టీయూసీఐ రాష్ట్ర నాయకులు రమేష్, ప్రకాష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్, కిషోర్, లాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు



నవీపేటలో టీబీ వ్యాధి నిర్ధారణ వ్యాధి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నవీపేట,మే13(ఆంధ్రజ్యోతి): నవీపేట ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. జాతీయ క్షయవ్యాధి నిర్మూలనలో భాగంగా కొత్తరకంగా వచ్చిన చర్మ పరీక్ష సైటీబీ టెస్టను ఫ్రంట్ లైన్ వారియర్స్ అయిన ఆశా కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులకు టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. 55మంది సిబ్బందికి ఈ పరీక్షలు నిర్వహించారు. టీబీ వ్యాధి పాజిటివ్ వచ్చిన వారికి సత్వరమే చికిత్స అందించడానికి ఈ పరీక్ష సులువుగా ఉంటుందని వైద్య సిబ్బంది పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కావ్య, సూపర్‌వైజర్ కిషన్, రత్నకుమారి, ఆయేషా, గోదావరి తదితరులున్నారు.

## వడ్యాట్‌లో రైతుల వద్దకు శాస్త్రవేత్తలు



రైతులకు పంటలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

మోర్తాడ్,మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్యాట్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు వివిధ పంటలపై అవగాహన కల్పించా రు.విశ్వవిద్యాలయంలోని పరిశోధన ఫలితాలను క్షేత్రస్థా యిలో రైతులకు విజ్ఞానాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో ఈకార్యక్రమం చేపట్టారు.ఈనెల 5 నుంచి జూన్ నెల 13వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా రైతు వేదికలు ప్రత్యేక అవ గాహన నిర్వహించడం జరుగుతుందని వ్యవసాయాధికారి హరీష్‌కు మార్ తెలిపారు.వానకాలం ప్రారంభంలోని రైతులకు వ్యవసాయ అను బంధ రంగాలకు సంబంధించి వివిధ అంశాలపై అవగాహన కల్పించేం దుకు శాస్త్రవేత్తలు రైతుల వద్దకే వస్తున్నారని తెలిపారు. అధిక దిగుబ డులను ఇచ్చేటటువంటి నూతన వంగడాలు, వివిధ రకాలపై శిక్షణతో పాటు ముఖ్యంగా యూరియా వాడకం తగ్గించడం మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడకం వల్ల కలిగే నష్టాల గురించి విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, భూగర్భ జలాల పరిరక్షణ కోసం తాగునీటి వియోగంపై అవగాహన, పంటల మార్పిడి, చెట్ల పెంపకం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హరీష్‌కు మార్, ప్రాంతీయ చెరుకు, వరిపరిశోధన శాస్త్రవేత్త మంజుభార్గవి, దుర్గారాణి, పశువైద్యాధికారి గౌతమ్, ఏఈవో రంజిత్, నవీన్ పాల్గొన్నారు.

**కమ్మర్‌పల్లి:** రైతులు తమ పంట పొలాల్లో భూసారాన్ని పెంపొందించుకునే మార్గలను ఎంచుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం కమ్మర్‌పల్లి రైతువేదికలో రైతుల ముంగిల్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని స్థానిక వ్యవసాయాధికారి రమ్యశ్రీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. సమతూల్య ఎరువుల వినియోగం, యూరియాతో పాటు ఇతర పోషకాలు కలిగిన ఎరువులను వాడడంవలన వాడకం వల్ల నేల ఆరోగ్యంగా మెరుగుపడుతుందనాన్నరు. కార్యక్రమంలో రుద్రూర్ వ్యవసాయపరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు ఆకుల దినేష్, ఫుడ్ టెక్నాలజి అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీలత, వెటర్నిరి డాక్టర్ రాజశేఖర్‌రావు, రిజినల్ మేనేజర్ టీజీ సీడ్స్ రఘు, ఏఈవోలు రమేష్, శ్యామ్, కావ్య, పద్మ స్థానిక రైతులు పాల్గొన్నారు.

## వర్నిలో సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ

వర్ని,మే13(ఆంధ్రజ్యోతి): కార్మికులను కష్టాల పాలు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక నేత నన్నేసాబ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని సామాన్య ప్రజల ఐక్యతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీపీ యూనియన్ వర్ని మండల అధ్యక్షుడు సాయిలు, నాయకులు సాయిచరణ్, పోశెట్టి, రేఖ, సాయవ్వ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రామాలయ వార్షికోత్సవం

భీమ్‌గల్‌రూరల్ , మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మెండోర గ్రామంలో గత మూడు సంవత్సరాల క్రితం నిర్మించిన శ్రీరామాలయం వార్షికోత్సవ కార్యక్రమం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం దాతల విరాళాలతో తయారుచేసిన వెండి కిరీటాలు ఆభరణాలను విశ్వబ్రాహ్మణుల ఇంటినుంచి మంగళ హారతులు, వాయిద్యాలతో ఎదుర్కోలుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం శాస్త్రోక్తంగా ఆభరణాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు నరేందర్ పంతులు నూతనంగా తయారు చేసిన వెండి కిరీటం ఆభరణాలను విగ్రహ మూర్తులకు అలంకరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ పండితులు ప్రవీణ్ శర్మ, గ్రామకమిటి అధ్యక్షుడు గౌరు రాజన్న, ఉపాధ్యక్షులు గుడిసె సాయిబాబా, కోశాధికారి గంగారెడ్డి, గ్రామ పరజలు, భక్తులు పాల్గొన్నారు.

## పడిగెలలో భీమన్న ఇడంబికిల కల్యాణోత్సవం

వేల్పూర్, మే 13(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పడిగెల గ్రామంలో నాయకపోడు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారు జామున భీమన్న ఇడంబికిల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం నాయకపోడు సంఘ భవనం నుండి నేరడికుండతో డప్పు వాయిద్యాల మధ్య శోభాయాత్ర నిర్వహించి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయ కాపు సంఘం అధ్యక్షుడు ఏర ముత్తెన్న, కార్యవర్గ సభ్యులు గంగమల్ల య్య, చిన్నమల్లయ్య, ఈదుల ఊషన్న, ఏదుల కిషన్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 'పార్టీ గెలుపుకోసం కార్యకర్తలు కృషి చేయాలి'

బోధన్‌రూరల్,మే13(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో వచ్చే మున్సిపల్ ఎన్నికలలో మున్సిపల్ చైర్మన్ సీటు కైవసం చేసుకోవడానికి ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని ఎంఐఎం పార్టీ జిల్లా అధ్యక్షులు ఫయాజ్ హైమద్ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని రాకాసి పేట్‌లోని మరబ్బా ఫంక్షన్ హాల్‌లో నూతనంగా ఎన్నుకోబడిన పార్టీ కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షులుగా మీర్ ఇలియాజ్ అలీతో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ జిల్లా నాయకులు, నూతన కార్యవర్గం సీనియర్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## లబ్ధిదారులను గ్రామ సభల ద్వారానే ఎంపిక చేయాలి

వేల్పూర్ , మే 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు రాజీవ్‌యువవికాస్ పథకాల్లో లబ్ధిదారుల ఎంపిక గ్రామసభ ద్వారానే చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వేల్పూర్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక సరైన రీతిలో జరగలేదని లబ్దిదారుల ఎంపిక లిస్టు గ్రామసభలో తెలపకుండా కాంగ్రెస్ పార్టీ నాయకుల ఇండ్లలో కూర్చొని ఎంపిక చేశారని వారు ఆరోపించారు. సునీల్‌రెడ్డి స్వంత మండలమైన మెండోరలో ఏ గ్రామంలోనైనా ఇందిమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక గ్రామసభలో నిర్ణయించారా అని వారు సవాల్ విసిరారు. ఇందిరమ్మ ఇండ్లు రాజీవ్‌యువవికాస్ పథకాల లబ్దిదారులను గ్రామసభల ద్వారానే ఎంపిక చేయాలని అలా చేయకుంటే బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన ధర్నాలు, ఆందోళనలు, నిరసన వంటి కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మెండోర, బాల్కొండ, మోర్తాడ్, కమ్మర్‌పల్లి బీఆర్‌ఎస్ పార్టీ మడల అధ్యక్షులు శేఖర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ఏలియా, రేగుంట దేవేందర్, నాయకులు చౌట్‌పల్లి రవి, రేగుల్ల రాములు, నేముల రవీందర్, నల్ల రమేష్, జాన్కంపేట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : బోధన్ ఎమ్మెల్యే

రెంజల్,మే13(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన అతి కొద్ది రోజుల్లోనే ప్రతి ఒక్కరికి సంక్షేమాన్ని అందించి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. మంగళవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. రికార్డులను పరిశీలించి సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండి సర్వీస్ అందించాలని సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డకు పెద్దన్నగా కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌ల ద్వారా లక్ష రూపాయలను అందించి కుటుంబాన్ని ఆదుకునేందుకు ఉ పయోగపడుతుందని, ప్రతి ఒక్క ఆడపడుచుకు అండగా ఉండేందుకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఎంతగానో ఉపయోగపడుతుందని రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలో ఆడబిడ్డకు షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి ద్వారా కుటుంబాలను ఆదుకుంటున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరిట మాటలు చెప్పి చేతల్లో చేసింది ఏమి లేదని ఉద్యోగులకు తీరని అన్యాయం చేసిన ఘనత గత ప్రభుత్వంది అన్నారు. ఉద్యోగ సర్వీస్‌లో పీఎఫ్ డబ్బులను కూడా కాజేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

● రైతులు జీలుగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం రైతులకు సబ్సిడీ రూపంలో జీలుగ విత్తనాలను అందజేస్తుందని, జీలుగ విత్తనాల ద్వారా భూమి సారాన్ని పెంచి అధిక దిగుబడికి ఉపయోగపడుతుందని, జీలుగ విత్తనాలను ప్రభుత్వం రైతులకు 50శాతం సబ్సిడీతో అందజేస్తుందని ఒక జీలుగ బస్తా రెండున్నర ఎకరాలకు ఉపయోగపడుతుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెన్ బిన్ హందాన్, గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి, సాయిబాబా గౌడ్, సాయరెడ్డి, జావీదోద్దీన్, సురేందర్ గౌడ్, బాబు నాయక్, మోహన్, సాయాగౌడ్, గంగాకిషన్, అసాని అనిల్, గోసుల శ్రీనివాస్, ఎంఎల్ రాజు, యోగేష్, సురేష్, సద్దాం, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

● విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే

ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసి ప్రవేశ పరీక్షల కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఏఈపీసెట్ ఫలితాలలో రెంజల్‌కు చెందిన అసాని రిషికేష్ 2834ర్యాంకు సాధించడంతో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి విద్యార్థిని శాలువతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రావణ్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్, మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి, సాయిరెడ్డి, గంగాకిషన్, జావీదోద్దీన్, సాయిబాబా గౌడ్, అసాని అనిల్, సాయాగౌడ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

**బోధన్‌రూరల్:** అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించమే ప్రభుత్వ ధ్యేయమని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పారదర్శకంగా ఉండాలని ఆయన అధికారులతో పేర్కొన్నారు. మంగళవారం బోధన్ మండలంలోని అమ్దాపూర్, ఏరాజ్‌పల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల ఇంటి నిర్మాణాలకు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. కొన్ని చోట్ల ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వం ఎ



అమ్దాపూర్‌లో గ్రామస్థులతో మాట్లాడుతున్న దృశ్యం

న్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి గ్రామగ్రామాన అర్హులైన వారిని ఎంపిక చేసి ఇంటి నిర్మాణం కోసం 5లక్షల రూపాయలను ఉచితంగా అందజేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. గత ప్రభుత్వం చేసిన మోసాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. నిరుపేదలకు ఇళ్లు కల్పించడానికి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, సీనియర్ నాయకులు సంజీవ్ రెడ్డి, బోధన్ ఏఎంసీ డైరెక్టర్ వసంత్ రెడ్డి, సూర రవి, సాయరెడ్డి, నరేందర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, పల్లెన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**ఎడపల్లి:** ప్రభుత్వ ఉద్యోగులు విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తప్పవని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎడపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలను ఎమ్మెల్యే అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వారి హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం కార్యాలయాల్లో ఎంతమంది సిబ్బంది ఉన్నారు., హాజరు అయిన వారు ఎందరు, హాజరు కాని వారు ఎందరు ఉన్నారని, వారు సెలవులు తీసుకున్నారా లేదా అని విధుల్లో ఉన్న సిబ్బందిని అడిగి ఆరా తీశారు. అనంతరం మండల రైతులు మండల ప్రజల అవసరాలు తీర్చే మండల తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది సమయ పాలన పాటించడం లేదని, ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యేకు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సర్వేయర్ సామాన్య రైతుల భూములను సర్వే చేయడానికి ఎన్నో సాకులు చెబుతూనే రియల్టర్‌ల, బడా భూస్వాముల భూముల సర్వేను మాత్రం వెంటనే చేస్తున్నాడని, డబ్బులు ఇస్తేనే సర్వే చేస్తున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించి వారికి నమ్మకం కలిగించాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్ రైతుల భూముల సర్వే విషయంలో ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, డబ్బులు తీసుకుని నిజాం షుగర్స్ భూములు రిజిస్ట్రేషన్ చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని అటువంటి చర్యలపై తప్పక ర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఎడపల్లి, జైతాపూర్ సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి, సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లయ్య యాదవ్, కంచరి శ్రీనివాస్, ఆనంద్ రెడ్డి, బోధన్ ఏసీపీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆరోపణలు మానుకోవాలి : కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్ , మే 13(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం పై ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి నిరాదారమైన ఆరోపణలు చేయడం మానుకోవాలని మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, నాయకులు హితవు పలికారు. వేల్పూర్ మండల కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులువిలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీని, ప్రభుత్వాన్ని బదనం చేయడం కోసమే ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అర్థం పర్థం లేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. మండలంలోని ప్రతీ గ్రామంలో జీపీ కార్యదర్శి ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో పేదలను గుర్తించి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు జాబితాను కలెక్టర్‌కు పంపించడం జరిగిందన్నారు. కాగా కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తల ఇండ్లలో కూర్చొని ఇండ్ల మంజూరు లిస్టు ఫైనల్ తయారు చేశారని ప్రశాంత్‌రెడ్డి నిరాదారమైన ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. ఎక్కడైన తమ పార్టీవారు ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అవినీతికి గాని డబ్బులు వసూలు చేసినట్లు గాని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి నిరూపించాలని లేదంటే తమ ఎమ్మెల్యే పదవికి రాజీనామ చేయాని వారు డిమాండ్ చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూం మంజూరులో మీ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతీ ఇంటికి ఎంత వసూలు చేశారో అది బహిరంగ రహస్యమన్నారు. రాజీవ్‌యువవికాస్ పథకంలో యువకులు ఆన్‌లైన్‌లో మీసేవా ద్వారా



వేల్పూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

దరఖాస్తులు చేసుకోగా వాటిని అధికారులు పరిశీలిస్తున్న క్రమంలోనే అవినీతి జరుగుతుందని ప్రశాంత్‌రెడ్డి ఆరోపణ లు చేయడం హస్యస్పదమన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో యంత్రలక్ష్మీ ద్వారా ఎంతమంది రైతులకు లబ్ది చేకూర్చారని మీ నాయకులు, కార్యకర్తలకు ఎన్ని ట్రాక్టర్‌లు ఇచ్చారని అవి ఎవరికి అమ్ముకున్నారో వాటిపై బహిరంగ చర్చకు తాము సిద్దమేనన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నర్సారెడ్డి, నాయకులు మల్లేష్, నరేందర్, రాజేందర్, దామోదర్ గౌడ్, రమణ, శ్రీధర్, రాము, ఇంద్రగౌడ్, రాజేశ్వర్ తదితరులున్నారు.

## అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

బోధన్‌రూరల్,మే13(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి గ్రామస్థులు సన్మానించారు. అనంతరం అర్హులైన నిరుపేలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారిని మాత్రమే ఎంపిక చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బోధన్ మండల శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సిర్ప సుదర్శన్, ప్రధాన కార్యదర్శి జీలకరి ప్రవీణ్, శక్తికేంద్రం ఇన్‌చార్జ్‌లు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

ఆర్మూర్ రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని సోమవారం రాత్రి పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వెంకటేష్ తెలిపారు. జిల్లా ఎక్సైజ్ డిప్యూటి కమీషనర్ వి. సోమిరెడ్డి ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ వారు నిర్వహించిన తనిఖీల్లో గంజాయి విక్రయిస్తున్న వేల్పూర్‌కు చెందిన యాల్ల రిశ్వంత్‌ను అదుపులోకి తీసుకొని ఆయన వద్దనుంచి 750 గ్రాముల గంజాయి, ఒక బైక్, సెల్ ఫోన్‌ను స్వాదినం చేసుకున్నామన్నారు. అనంతరం ఆర్మూర్ పట్టణంలో తనిఖీలు నిర్వహించగా షేక్‌సమీర్, షేక్‌కరీమ్ అనే వ్యక్తులను పట్టుకుని వారివద్దనుంచి 2.3 కిలోల గంజాయిని, రెండు బైక్‌లు, రెండు ఫోన్‌లను స్వాదీనం చేసుకున్నామన్నారు. మొత్తం ముగ్గురి వద్ద 3 కిలోల గంజాయినీ స్వాదీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశామన్నారు. ఎక్సైజ్ దాడుల్లో ఎస్సై నర్సింహాచారి, సిబ్బంది విష్ణు, గంగారాం, భూమన్న, సాయికుమార్ పాల్గొన్నారు.

## అంకాపూర్‌లో గడ్డం రాజారెడ్డి విగ్రహ ఆవిష్కరణ

ఆర్మూర్ రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో మంగళవారం మాజీ సర్పంచ్ గడ్డం రాజారెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే దన్‌పాల్ సూర్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ 18 ఏళ్ల సర్పంచ్‌గా పనిచేసిన గడ్డం రాజారెడ్డి ఎలాంటి అవినీతికి తావు ఇవ్వకుండా సుమారు 400 కుటుంబాలకు నివాస గృహాలు అందజేసిన ఘనత సాదించారన్నారు. ఈ కార్యక్రమంలో పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, రమేష్‌రెడ్డి, విడిసి సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కోటగిరి,మే13(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రుద్రూరు ఎస్‌ఐ సాయన్న సూచించారు. రుద్రూరు మండలంలోని అక్బర్‌నగర్ గ్రామంలో మంగళవారం ఫుట్ పెట్రోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందిపాల్గొన్నారు.

## భగవద్గీత శ్లోకాలతో ఆకట్టుకుంటున్న చిన్నారి



ధాన్వీక

బోధన్‌రూరల్,మే13(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణానికి చెందిన రిషి-ప్రియ దంపతుల నాలుగేళ్ల కూతురు ధాన్విక భగవద్గీతలోని శ్లోకాలను చెబుతూ అందరిని ఆశ్చర్యపరుస్తుంది. చిన్నారి చెబుతున్న శ్లోకాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పలువురు చిన్నారిని, తల్లిదండ్రులను అభినందిస్తున్నారు, చిన్న వయసులో ధాన్వికకు తల్లి ప్రియ భగవద్గీతకు బోధిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.

## అమ్మవారి ఆలయంలో చోరీ

సదాశివనగర్, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాచారం తండాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం జగదంబా మాతా ఆలయంలో ఆదివారం చోరి జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం ఆలయంలోకి ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు చొరబడి అమ్మవారి అభరణాలు, హూండీని దోచుకెళ్లినట్లు తెలిపారు. సోమవారం ఉదయం ఆలయ పూజారీ రమేష్ మహారాజ్ పూజ చేయడానికి వెళ్లగా అమ్మవారిపై అభరణాలు, వెండి విగ్రహం, అమ్మవారి మగళసూత్రం, ఇతర వెండి వస్తువులు కన్పించలేదు. హూండీలోని నగదును సైతం ఎతుకెళ్లి నట్లు తెలిపారు.ఈమేరకు గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వెంటనే ఆలయానికి చేరుకుని పరిశీలించి కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## దాడి ఘటనలో ఒకరి మృతి

వేల్పూర్, మే 13(ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వివాదంలో ఇద్దరు కలిసి ఒకరిపై దాడికి పాల్పడగా బాధితుడు షేక్ థబ్రిజ్(38) మృతిచెందిన ఘటన వేల్పూర్‌లో జరిగింది. ఎస్సై సంజీవ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన షేక్ థాబ్రేజ్ తన ఇంటిపై కప్పు కూన వేయడానికి గూపల్ల్వార్ శ్రీనివాస్, అమల్వార్ వెంకటేశ్‌లను కూలీకి పిలిచారు. చాలా రోజులైనప్పటికి తమకు కూలీ డబ్బులు ఇవ్వాలని షేక్ థాబ్రీజ్‌ను పలుమార్లు అడిగారు. ఇందులో భాగంగా ఈనెల 5వ తేదీన బస్టాండ్ సమీపంలో మద్యం సేవించిన శ్రీనివాస్, వెంకటేశ్‌లు డబ్బుల విషయమై షేక్‌థబ్రిజ్‌తో గొడవకు దిగారు ఈ క్రమంలో కర్రలతో షేక్ థబ్రిజ్‌ను తీవ్రంగా కొట్ట డంతో బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొంది ఇంటికి వచ్చారు. ఇంటికి వచ్చిన ఆయన మంగళవారం ఉదయం మృతిచెందాడు. మృతుని సోదరి ఖలేదాబేగాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఎడపల్లి. మే13(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండల కేంద్రంలో మంగళవారం మధ్యా హ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగల్‌పాడ్ గ్రామానికి చెందిన మహిళ మృతి చెందినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బోధన్ నుంచి ఎడపల్లికి బోధన్ డిపోకు చెందిన టిఎస్ 16 జడ్ 0212 నంబరు గల బస్సులో వచ్చిన మంగల్‌పాడ్ గ్రామానికి చెందిన దేగాం నాగమణి(64) అనే మహిళ మంగల్‌పాడ్ చౌరస్తా వద్ద బస్సుదిగి బస్సు ముందు నుండి రోడ్డు దాటుతుండగా డ్రైవర్ బస్సును ముందుకు తీయడంతో బస్సు మహిళను ఢీకొని ఆమెపై నుండి వెళ్ళడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందిందని మృతి చెందిన మహిళ బంధువు వరుసకు కొడుకు అయ్యే దేగాం గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, బస్సు డ్రైవర్ ఎస్. నరేష్ రెడ్డిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## గుండెపోటుతో పోస్టల్ ఉద్యోగి మృతి

ఆర్మూర్ రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): నందిపేట మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌లో ఈడీడీఎ గా పనిచేస్తున్న తాడ్వాయి గంగాధర్ గౌడ్ (52) గుండె పోటుతో మంగళవారం మృతిచెందాడు. నందిపేటలోని హనుమాన్ గల్లీకి చెందిన గంగాధర్‌గౌడ్ ఆదివారం తన కూతురి వావాహం జరిపించాడు. అంతలోనే ఆయన గుండెపోటుతో మృతిచెందడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు జీర్ణించుకోలేకపోతున్నారు.

## గ్రామస్థాయిలో మున్నూరుకాపుల ఐక్యత చాటాలి



మాట్లాడుతున్న మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండాదేవన్న

కామారెడ్డిటౌన్,మే 13(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో మున్నూరుకాపుల ఐక్యత చాటాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండదేవన్న అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తున్నామని దీంట్లో భాగంగా గ్రామస్థాయిలో కమిటి సభ్యులకు కూడా మొదటిసారిగా ఓటుహక్కును కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఎన్నికల కార్యనిర్వహణ కమిటి నియమించి వారి ద్వారా మండల, పట్టణ,గ్రామకమిటి అధ్యక్ష, కార్యదర్శుల ఓటర్‌ఐడీ, జాబితాను సిద్దంచేసి రాష్ట్ర ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల జాబితాలను రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ చైర్మన్‌లు కేంద్రమంత్రి బండిసంజయ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,గంగుల కమలాకర్, రవిచంద్రలకు జాబితా పరిశీలించి రిటైర్డ్ జడ్జీలతో 119 నియోజకవర్గాల్లో ఒకేరోజు బ్యాలెట్ పత్రాలతో ఎక్కడికక్కడే ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి అంజయ్య, కోశాధికారి ఆంజనేయులు, యూత్ అధ్యక్షుడు క్రాంతి,వెంకట్రాజం, లింగం,శ్రీధర్, భీమేష్ పాల్గొన్నారు.

## ఆలూర్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



ఆలూర్‌లో చెక్కును అందజేస్తున్న దృశ్యం

ఆలూర్,మే 13(ఆంధ్రజ్యోతి):ఆలూర్ మండలంలో ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆలూర్ గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ విజయ భారతి మంగళవారం పంపిణీ చేశారు. సుమారు రూ. 7 లక్షల చెక్కులను 40 మందికి లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఇట్టి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే పైడిరాకేష్ రెడ్డికి లబ్ధిదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో ఆలూర్ మండల శాఖ అధ్యక్షుడు సూర శ్రీకాంత్ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు నాడిశేరం మల్లయ్య, మాజీ బీజేపీ మండల అధ్యక్షుడు గిరీష్, మండల కార్యదర్శి హర్షహరీష్,డాక్టర్ అరుణ్, సురేష్‌గౌడ్, మంతెన నితిన్ తదితరులున్నారు.

**బాల్కొండ:** బాల్కొండ మండల కేంద్రంలో బాల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి చొరవతో మంజూరైన చెక్కులను బాల్కొండ మండల బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ షహిద్ చెక్కులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మహమ్మద్ ఫయాజ్, ఇర్ఫాన్ బేగంలు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం చేస్తున్న కృషిని వారు ప్రశంసించారు.

## రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం : ఆర్‌టీఓ

కామారెడ్డిటౌన్,మే13(ఆంధ్రజ్యోతి):రోటరీక్లబ్ సేవలు అభినందనీయమని ఆర్‌టీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రోటరీక్లబ్ లో వికలాంగులకు రోటరిక్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సీటీ సంయుక్తసౌజన్యంతో 50 వేల విలువ గల వీల్‌ఛైర్‌లు అందించే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో ప్రతి వ్యక్తి బాధ్యతగా వ్యవహరించాలని ఇబ్బందుల్లో ఉన్న వారికి చేయుతను అందించే వారే గొప్ప వ్యక్తులని అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వికలాంగులకు వీల్‌చైర్‌లు అందించడం సంతోషకరమని అన్నారు. రోటరీక్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఎంతైన ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు రాజనర్సింహరెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ ఎలెక్ట్ జైపాల్‌రెడ్డి, ట్రెజరర్ కృష్ణహరి, రోటిరియన్స్ సుభాష్‌చంద్రజైన్, కాశీనాథం, ధనంజయ, బాలరాజు, నాగభూషణం, శంకర్,సుధాకర్‌రావు, వెంకటరమణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన దండుగుల ఎల్లయ్య(57)జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపా రు. మూడేళ్ల క్రితం తన భార్య మరణించడంతో మృతుడి ఆరోగ్యం క్షీణించింది. దీంతో ఆదివారం గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష

ఆర్మూర్‌టౌన్,మే13(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌కు చెందిన ముగ్గురికి రెండురోజుల సాధారణ జైలు శిక్షను మార్నింగ్ కోర్టు న్యాయాధికారి గట్టు గంగాధర్ విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. ఇటీవల పెర్కిట్‌లో అర్ధరాత్రి వరకు తమ షాప్‌లను తెరిచి ఉంచినందుకుగాను షేక్ మాజిద్, షేక్ సాజిద్, షేక్ ఫరూక్‌లకు రెండు రోజుల సాధారణ జైలుశిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## మనస్థాపానికి గురై యువకుడి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుర్బిర్యాల్ గ్రామానికి చెందిన షేక్‌జమాలుద్దీన్ (29)గ్రామ చెరువులోపడి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్న మృతుడు జమాలు ద్దీన్ భార్య సంవత్సరం క్రితం పుట్టింటికి వెళ్లి రావడం లేదని మనస్థాపానికి లోనై శనివారం ఇంట్లోనుంచి వెళ్లిపోయాడు. మృతుడి కుటుంబ స భ్యులు ఆయన కోసం గాలించగా మంగళవారం చెరువులో శవమై కనిపించాడు. దీంతో ఎస్‌హెచ్‌వో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

మాక్లూర్, మే 13(ఆంధ్రజ్యోతి):మాక్లూర్ మండల పరిధిలో ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరు పట్టుబడినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. నిందితులకు మంగళవారం స్పెషల్ జ్యూడిషియల్ మెజీస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ ముందు హాజరుపరచగా వారిలో ఒకరికి రెండు రోజులు,మరొకరికి మూడు రోజులు జైలుశిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు. ఇకనైనా మందుబాబులు మద్యం తాగి వాహనాలు నడపొద్దని ఆయన హెచ్చరించారు.

● నవీపేటలో.. మరో ఐదుగురికి జైలుశిక్ష

నవీపేట,మే13(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురు డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డారని ఎస్సై వినయ్ తెలిపారు. వీరిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ న్యాయాధికారి నూర్జహాన్ బేగం ఒక్కొక్కరికి రెండు రోజుల చొప్పున జైలుశిక్ష విధించారని ఆయన పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని ఆయన పేర్కొన్నారు.

..9 మందిపై కేసు నమోదు

ఆర్మూర్‌రూరల్,మే 13(ఆంధ్రజ్యోతి):నందిపేట మండల కేంద్రంలో సోమవారం డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించగా మద్యంతాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 9 మందిపై కేసునమోదు చేసి మంగళవారం కోర్టులో హాజరుపరిచామని ఎస్సై చిరంజీవి తెలిపారు. వీరిలో 8మందికి న్యాయాధికారి గట్టు గంగాదర్ ఒక్కొక్కరికి రూ.రెండువేల చొప్పున జరిమాన విధించి మరొకరికి రెండురోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.


పట్టణంలో స్వైర విహారం చేస్తున్న కోతులు

## బాన్సువాడ.. కిష్కింద కాండ

● భయాందోళనలో చిన్నారులు, ప్రజలు
● ఇళ్లలోకి చొరబడుతున్న కోతులు ● పట్టించుకోని అధికారులు

బాన్సువాడ టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలోని వాడవాడలా వానర సైన్యం స్వైర విహారం చేస్తున్నాయి. రోజురోజుకు కోతుల సంఖ్య అమాంతంగా పెరిగిపోతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే బాన్సువాడ మరో కిష్కిందకాండను తలపిస్తుంది. ప్రతీరోజు వందల సంఖ్యలో వానరాలు పలు కాలనీల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. ఏ కాలనీ వైపు కన్నెత్తి చూసినా కోతులే దర్శనమిస్తున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు వాటి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఇళ్లలో చొరబడి తినుభాండారాలను ఎత్తుకెళ్లిపోతున్నాయి. ప్రజలపై దాడులు చేస్తున్నాయి. ఎప్పటికే చాలా మంది కోతుల దాడిలో గాయాల భారిన పడి ఆస్పత్రుల పాలైన సంఘటనలున్నాయి. వానరాలను నియంత్రించాలని ప్రజలు అధికారులకు మొరపెట్టుకుంటున్నప్పటికీ ఫలితం మాత్రం శూన్యంగానే ఉంది. ఏమి చేయలేని పరిస్థితి అంటూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. వానరసైన్యం వందల సంఖ్యల్లో తరలివస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

### ఇళ్లలో చొరబడుతున్న కోతులు.. గాయాల బారిన ప్రజలు

వానరసైన్యం ఆహారం కోసం ఇళ్లలోకి చొరబడుతున్నాయి. ముఖ్యంగా పట్టణంలోని శ్రీరామ కాలనీ, టీచర్స్‌కాలనీ, భేతాళస్వామి కాలనీ, పాత బాన్సువాడ, సంగమేశ్వర కాలనీలతో పాటు పలు కాలనీల్లో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. ఇళ్లలోకి ప్రవేశించి వస్తువులను చిందరవందర చేస్తున్నాయి. తినుభాండారాలను ఎత్తుకెళులుతున్నాయి. ఎవరైనా తరిమేద్దామని చూస్తే వారిపై దాడికి పాల్పడుతున్నాయి. ఇంటి తలుపులను సైతం తోసుకుంటూ ఇళ్లలోకి చొరబడుతున్నాయి.

### జంకుతున్న జనం

కోతులు విచ్చలవిడిగా పట్టణంలో తిరుగుతుండడంతో జనం జంకుతున్నారు. ఇళ్లలో నుంచి బయటకు వెళ్లే పరిస్థితి కానరావడం లేదు. కర్రలు చేతబట్టి తరిమితే తప్ప బయటకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతుండడంతో తరిమికొట్టే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. కాఈనల్లో చిన్నపిల్లలు, వృద్ధులు బయట తిరగలేని పరిస్థితి నెలకొంది.

### పట్టించుకోని అధికారులు

బాన్సువాడ పట్టణంలో కోతుల నియంత్రణలో అధికారులు విఫలమయ్యారనే చెప్పవచ్చు. కోతులే కదా అని చాలా తేలికగా తీసుకుంటున్నారు. కానీ వాటి నియంత్రణ కోసం కనీస చర్యలు కూడా తీసుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కోతుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. ఒక్కసారి మంద కనిపిస్తే తక్కువతో తక్కువ 50 నుంచి 100 వరకు కోతులు ఉంటున్నాయి. పరిస్థితి ఇ లాగే ఉంటే మాత్రం రాబోయే రోజుల్లో జన సంచారంతో వానర సం చారం కూడా రోడ్లపై ఉంటుందనే చెప్పవచ్చు. కోతుల



ధాటికి చిన్నారులు, గృహిణులు, వృద్ధులు భయాందోళనలో ఉండిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల నియంత్రణ కోసం చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# జోరుగా కొనసాగుతున్న గంజాయి రవాణా

మెండోర, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతతకు మారు పేరైన పల్లెల్లో గంజాయి చిచ్చు పెట్టుతుంది. విద్యార్థుల నుంచి మొదలుకొని పండు ముసలి వాళ్ల వరకు గంజాయి మహమ్మారి బారిన పడి అనారోగ్యం పాలవుతున్నారు. అడ్డూ అదుపు లేకుండా విచ్చల విడిగా లభ్యం కావడంతో గంజాయికి బానిసలవుతున్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యమో గంజాయి స్మగ్లర్ల అదృష్టమో తెలియదుకాని గంజాయి రవాణా రోజురోజుకు విస్తరిస్తుంది.

### గంజాయికి బానిసవుతున్న విద్యార్థులు, యువత

మండలంలోని ఒక గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులు కొందరు గంజాయితీ అలవాటు పడి నిత్యం గంజాయి పీలుస్తున్నారు. గంజాయి కోసం మండలంలోని ఇంకో గ్రామానికి వెళ్లి దొంగచాటుగా గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చి పీలుస్తున్నారు. గంజాయి కావాలని యువత ఫోన్ చేస్తే చాలు గుట్టు చప్పుడు కాకుండా పది నిమిషాల్లో యువత చేతుల్లో గంజాయా పెడుతున్నారు. అంతేకాకుండా గోదావరి నది పరిసర గ్రామాల్లో గంజాయి స్మగ్లింగ్ జోరుగా కినసాగుతున్నదన్న ఆరోపణలు ఉన్నాయి.

### జోరుగా కొనసాగుతున్న గంజాయి స్మగ్లింగ్

మెండోర మండలంలో గంజాయి సాగు లేనప్పటికి స్మగ్లర్లు పొరుగు జిల్లాలైన ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల నుంచి రాజకీయ నాయకుల అండదండలతో గంజాయి తెప్పిస్తూ ఇక్కడ విక్రయాలు జరుపుతున్నారు. గంజాయికి మండలంలో కొన్ని గ్రామాల్లో మహిళలు, వృద్ధులు సైతం బానిసైనట్లు తెలిసింది. గంజాయి స్మగ్లర్లకు ఇదంతా లాభసాటిగా మారడంతో దీనికి తోడు అడ్డుకునే వారు లేకపోవడంతో గంజాయి స్మగ్లింగ్ దందా మూడు పువ్వులు, ఆరుకాయలుగా కొనసాగుతుంది.


పోచంపాడ్‌లో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకున్న సంబంధిత అధికారులు (ఫైల్)


ఇటీవలే స్వాధీనం చేసుకున్న ఎండు గంజాయి (ఫైల్)

### ఇటీవల ఓ గ్రామంలో దొరికిన గంజాయి

మండలంలోని ఇటీవల ఓ గ్రామంలో కిరణ్ దుకాణంలో గంజాయి దొరికిన కాని పట్టుకుని పట్టుకున్నట్లే వారిని రాజకీయ పలుకుబడితో వారిని విడిచి పెట్టినట్లు సమాచారం. ఆ గ్రామంలో గంజాయి తతంగం ఇంత జరుగుతున్నా కానీ సంబంధిత అధికారులకు తెలిసిన కాని చూసి చూడనట్లు వ్యవహరించడం చర్యకు దారితీసింది. మండలంలో గంజాయి కావాలంటే చాలు ఆ కిరణ్ దుకాణంలోకి వెళితే చాలు దొరుకుతుందనే యువత చర్చించుకుంటున్నారు. ఇదే విషయం సంబంధిత శాఖ అధికారులకు తెలియడంతో వెళ్లి తనిఖీ చేయగా అధి కారులు అవాక్కయ్యారు. ఇది కాస్త రాజకీయ రంగు నపూసుకోవడం బయటకు పొక్కకుండ చూసోక లేదటే నువ్వు ఇక్కడి నుంచి బదిలీ కావడం పక్క అని హెచ్చరించడంతో సంబంధిత అధికారులు తగ్గారు. ఇదే విషయం పై స్థాయి అధికారులకు తెలుపడంతో కిందస్థాయి కుర్చీకే ఎసరు వచ్చింది. దీంతో గంజాయి స్మగ్లింగ్ రాజకీయ నాయకులకు, అధికారులకు మధ్య పెద్ద తలనొప్పిగా మారింది.

### పట్టించుకోని అధికారులు

మండలంలో ఇంతపెద్ద మొత్తంలో గంజాయి స్మగ్లింగ్ జరుగుతున్న కాని సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్లజలు వాపోతుఆన్నరు. ఇటీవల గంజాయి స్మగ్లింగ్ చేస్తున్నా వారిని పట్టుకున్నప్పటికి మళ్లీ గంజాయి దందా జోరుగా సాగుతున్న చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ప్రజలు అనుమానిస్తున్నారు. గంజాయి స్మగ్లింగ్‌ను అరికట్టక పోతే విద్యార్థులు, యువత రోగాల భారీనపడే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా గంజాయి స్మగ్లింగ్‌ను అరికట్టాలని విద్యార్థులకు, యువకులకు గంజాయిపై అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

**గంజాయి విక్రయిస్తే ఎంతటి వారైనా సరే వదిలే ప్రసక్తే లేదు**

● యాసిర్ అర్ఫత్, ఎస్సై, మెండోర



మండలంలో గంజాయి విక్రయిస్తే ఎంతటి వారైనా సరే వదిలి పెట్టె ప్రసక్తి లేదు. యువత గంజాయికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు. తమ పిల్లలు చెడు అలవాట్లకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. గంజాయి తాగే వారి అడ్డాలను గుర్తించామని త్వరలోనే కేసులు నమోదు చేస్తాం.

# కలెక్టర్ గారూ.. జర స్పందించండి!

● పచ్చని చెట్లు అగ్గిపాలు ● లక్షల రూపాయలు బుగ్గిపాలు ● అగ్నికి ఆహుతవుతున్న హరిత హారం చెట్లు

సుభాష్‌నగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వాలు గత కొన్ని ఏళ్లగా హరితహారంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటించింది. ఇప్పటికే మొక్కలన్నీ పచ్చని వృక్షాలుగా తయారయ్యాయి. గత కొన్ని సంవత్సరాలుగా కొందరి నిర్లక్ష్యం వల్ల వృక్ష్యాలన్ని అగ్నికి ఆహుతవుతున్నాయి. అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో రోడ్డుకు ఇరువైపుల ఉన్న పచ్చని చెట్లతో పాటు ఆహ్లాదాన్ని పంచే పూల చెట్లు సైతం అగ్గిపాలు అవుతున్నాయి. వరి కుప్పలకు నిప్పు పెట్టడంతో నిప్పు రోడ్లపై ఉన్న చెట్లవరకు వ్యాపించి కాలిపోతున్నాయి. ప్రతీ సంవత్సరం వందలాది చెట్లు అగ్నికి ఆహుతవుతున్నాయి. ప్రధాన రహదారుల్లో ప్రతియేటా ఇదే జరుగుతున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. లక్షల రూపా యలు వెచ్చించి ప్రధాన రహదారుల వెంట ఎవెన్యూ ప్లాంటేషన్ పేరుమీద లక్షలాది మొక్కలను ప్రభుత్వం నాటించింది. ప్రస్తుతం అవి చెట్లుగా మారి ఆ హ్లాదంతో పాటు చల్లని నీడనిస్తున్నాయి. వాటిపై అధికారులతో పాటు బాధ్యతగల పౌరులు కూడా పట్టించుకోకపోవడంతో ఎక్కడికక్కడ చెట్లు కాలి బూడిదవుతున్నాయి. హరితహారం పేరుమీద అడవులను పెంచుతామన్న ప్రభుత్వం రోడ్డున ఉన్న చెట్లను సైతం కాపాడలేకపోతుంది. గతంలో చెట్లను నరికి వేసిన అధికారులు జరిమానాలు విధించేవారు. ప్రస్తుతం కళ్లముందే వందలాది చెట్లు అగ్నికి ఆహుతవుతున్నా పట్టించుకోవడం లేదు. నిజామాబాద్ నుంచి నందిపేట్ వెళ్లే ప్రధాన రహదారిలో వేలాది చెట్లు అగ్నికి ఆహుతైపోయాయి. అటుపై వెళ్తున్న అధికారులు సైతం వాటిని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. వీటిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.



### ఒక్కో మొక్కకు వెయ్యి రూపాయలకు పైనే ఖర్చుచేసిన ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం ఎవెన్యూ ప్లాంటేషన్ పేరుమీద రోడ్డుకు ఇరువైపులా వేలాది మొక్కలను నాటించింది. వీటి సంరక్షణ కోసం మండల అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించింది. మొక్కలు నాటిన నాటినుంచి రెండు సంవత్సరాల వరకు వీటి సంరక్షణ బాధ్యత మండల అధికారులతో పాటు గ్రామ పంచాయతీ అధికారులకు ఉండేది. ఒక్కో మొక్కపై వెయ్యిరూపాయలకుపైగా ఖర్చు చేసింది. మొక్క నర్సరీ నుంచి మొదలుకొని రెండు సంవత్సరాల వరకు నీళ్లు పట్టడం నుంచి తదితర పనుల నిమిత్తం వెయ్యి రూపాయలు ఖర్చుచేస్తున్నారు. రెండు సంవత్సరాల వరకు చెట్టుగా మారుతుంది. ఇలాంటి చెట్లను కొందరి నిర్లక్ష్యం కారణంగా అగ్గిపాలవుతున్నాయి. వరికుప్పకు నిప్పుపెట్టి నిర్లక్ష్యంగా వెళ్లిపోతుండడంతో రోడ్డుపైన ఉన్న చెట్లకు నిప్పంటుకొని బుగ్గిపాలవుతున్నాయి. గతంలో మేకలు, గొర్లు హరిత హారం మొక్కలను తింటే జరిమానాలు విధించిన అధికారులు ప్రస్తుతం ఏపుగా పెరిగిన చెట్లు అగ్గిపాలవుతుంటే చర్యలు తీసుకోవడంలో ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### నాడు ఆహ్లాదకరం.. నేడు అంధ వికారం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎవెన్యూ ప్లాంటేషన్‌ను రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటింది. ఇవి చెట్లుగా మారి నీడతోపాటు ఆహ్లాదాన్ని కూడా పంచాయి. కొన్నేళ్లుగా రోడ్డుకు ఇరువైపులా చెట్లు ఏపుగా పెరగడంతో అటువైపు వచ్చే వాహనదారులకు ఆహ్లాదాన్ని పంచాయి. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు అగ్నికి ఆహుతి కావడంతో అంధవికారంగా తయారయ్యాయి. ఇప్పుడైనా ప్రభుత్వ అధికారులు స్పందించి వీటిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వీటిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తే ప్రభుత్వం చేపట్టిన అహరితహారం కార్యక్రమం సఫలీకృతమవుతుందని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

■ జర దేఖో!!


కాలిపోయిన పచ్చని చెట్లు

### చెట్లను కాల్చినవారిపై చర్యలు తీసుకోవాలి

● రాజేందర్, నవీపేట్ వాసి



కొందరి నిర్లక్ష్యం వల్ల పచ్చని చెట్లు అగ్గిపాలవుతున్నాయి. నిప్పు పెట్టిన వారు చెట్లకు అంటకుండా చూసుకుంటే బాగుంటుంది. ఏపుగా పెరిగిన చెట్లు అంధవికారంగా తయారై రోడ్డుకు ఇరువైపుల చెట్లు లేకుండా బోసిపోతున్నాయి. ప్రభుత్వం ఎంతో వ్యయప్రయాసాలకోర్చి చెట్లను నాటితే నిర్లక్ష్యం వల్ల చెట్లు బుగ్గిపాలవడం సరైంది కాదు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలి.

# నేటి నుంచి రామాలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

● రూ.కోటి విరాళాలతో ఆలయ నిర్మాణం

ఆర్మూర్ రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): నందిపేట్ మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీ ఏర్పడి 40 ఏళ్లు గడుస్తున్నా వారికంటు రామాలయం లేకపోవడం వారిని ఆవేదనకు గురిచేసింది. దీంతో గ్రామస్థులు, కాలనీ వాసులు చేయిచేయి కలిపారు. రామాలయ నిర్మాణమే ధ్యేయంగా కొన్నేళ్లుగా ముందుకు సాగారు. కోటి రూపాయలు వెచ్చించి సీతా రామచంద్ర ఆలయం నిర్మించారు. నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు చేయనున్నారు.


నందిపేటలో నిర్మించిన రామాలయం

### ఆలయ నిర్మాణానికి ముందుకు వచ్చిన దాతలు

ఆలయం నిర్మించాలంటే పెద్ద ఖర్చుతో కూడుకున్న పని దీంతో కాలనీ వాసులు సభ్యత్వ రుసుముతో విరాళాల సేకరణ ప్రారంభించారు. రూ. 25 వేలతో సభ్యత్వ రుసుము నిర్ణయించి 250 మందికి సభ్యత్వం కల్పించారు. దీంతో ఆలయ నిర్మాణానికి రాజబాట పడింది. సభ్యత్వ రుసుముతో భక్తులు అందజేసిన విరాళాలతో ఎట్టకేలకు రామాలయ నిర్మాణం పూర్తి చేసుకున్నారు. ఎంపీ నిధులతో ఆలయ ఆవరణలో ధర్మశాల గదులు నిర్మించారు. కల్యాణ మండపం (ఆర్టిషన్ షెడ్) నిర్మించాలన్నా యోచనలో ఉన్న రామాలయ కమిటి సభ్యులకు ఎంపీ అర్వింద్ నిధులు మంజూరుకు ముందుకు వచ్చారు. అదే విధంగా ఆలయ ప్రహరి నిర్మాణానికి ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి నిధులు మంజూరు చేయించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

### విగ్రహ ప్రతిష్ఠాపనకు రానున్న హంపీ పీఠాధిపతి

నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న రామాలయ విగ్రహ ప్రతిష్ఠాపనకు హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతీ స్వామి, మంగి రాము లు మహరాజ్ హాజరై శ్రీసీతారామ చంద్రస్వామి దే వాలయ యంత్ర, మూర్తి, శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

### ప్రజల విరాళాలతో సాధ్యమైంది

● మంద సాయన్న, నందిపేట్



రామాలయ నిర్మాణం ప్రజల విరాళా లతోనే సాధ్య మైంది. చిన్న మొత్తంగా విరాళం నుంచి ప్రారంభించగా భక్తులు, దాతలు పెద్దమొత్తంలోనే విరాళాలు అందించారు. సభ్యత్వ రుసుం నిర్ణయించగా దానివల్ల పెద్ద మొత్తంలో విరాళం సమకూరాయి. సమష్టి కృషితోనే ఆలయ నిర్మాణం సాధ్యమైంది.

### ఎన్నోయేళ్ల కల సాకారం అయింది

● రాజు, నందిపేట్



రామాలయం నిర్మించాలన్నది దశాబ్దాల కల. సుమారు 40 ఏళ్ల క్రితం శ్రీరాంనగర్ కాలనీ ఏర్పాటైనప్పటికి ఆలయం లేక ఇబ్బందిగా ఉండేది. గత కొన్నేళ్లు గా శ్రీరామనవమి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తూవచ్చాం. ఆలయం నిర్మించాలన్న కల సాకారం అయినందుకు నందిపేట ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణం జరిగేనా..!?

● శిలాఫలకాలకే పరిమితమైన ఉప కేంద్రాల నిర్మాణం ● బిల్లులు రాక నిలిచిపోయిన నిర్మాణ పనులు

మద్నూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): పల్లె ప్రజల చెంతకు వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో గత ప్రభుత్వం ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన భవన నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణం జరగకపోవడంతో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, రోగులు, సుదూర ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాలలో అనారోగ్యానికి గురైతే సుదూర ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లలేక గ్రామాల్లో ఉన్న ఆర్ఎంపీ, పీఎంపీ, ప్రథమ చికిత్స కేంద్రాల్లో వైద్య సేవలు పొందుతున్నారు. అక్కడి ఆర్ఎంపీల సిఫారసు మేరకు జిల్లా కేంద్రాల్లోని ప్రైవేటు ఆసుపత్రుల్లో వేలల్లో డబ్బులు ఖర్చు చేస్తున్నారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో ఐదు ఆరోగ్య ఉప కేంద్రాలకు గత ప్రభుత్వం నిధులు మం జూరు చేయగా ఇంతవరకు వాటిని పూర్తి చేయకపోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయాయి. డోంగ్లి మండలంలోని లింబూర్, గ్రామంలో పనులు సాగుతూనే నిలిచిపోయాయి. మద్నూర్ మండల కేంద్రంలో రెండు ఉప కేంద్రాలతో పాటు మేనూర్ ఆరోగ్య ఉప కేంద్రం పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఒక్కో ఉప కేంద్రం భవన నిర్మాణానికి గత ప్రభుత్వం 20 లక్షల చొప్పున నిధులు కేటాయించింది. మొదటి విడతలో నిధులు మంజూరైనా వాటితో పనులు పూర్తిచేసి మిగతా నిధులు రాకపోవడంతో అర్థాంతరంగా నిర్మాణం పనులను నిలిపివేసినట్లు కాంట్రాక్టర్లు వెల్లడిస్తున్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పాటు ప్రస్తుత ప్రభుత్వం అవసరమైన నిధులను కేటాయించినట్లయితే తమ గ్రామాలలో ఉప కేంద్రాల నిర్మాణం పూర్తయి తమకు అందుబాటులో ఉంటాయని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఈ విషయమై డోంగ్లి పిహెచ్‌సీ వైద్యురాలు శ్రీలేఖను వివరణ కోరగా డోంగ్లి మండలంలో లింబూర్, ఎన్ బూర, గ్రామాల్లో, మద్నూర్ మండల కేంద్రంలో రెండు, మేనూర్ గ్రామంలో ఒకటి ఆరోగ్య ఉప కేంద్రాలకు నిధులు మంజూరయ్యాయని. నిధులు సరిపోకపోవడంతో అర్థాంతరంగా పనులు నిలిచిపోయినట్లు తన దృష్టికి వచ్చిందని ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని తెలిపారు.


లింబూరులో అసంపూర్తిగా నిలిచిపోయిన ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణ పనులు


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## ఘనంగా రేణుక ఎల్లమ్మ కల్యాణోత్సవం

మోస్రా, మే 13 (ఆంధ్రజ్యోతి): చందూర్ మండల కేంద్రంలో గల రేణుక ఎల్లమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. బోనాలు తీసి అమ్మవారికి దూపదీప నైవేద్యం సమర్పించి జమదగ్ని మునితో కల్యాణం కార్యక్రమం చేశామని అదేవిధంగా సోమవారం నాడు పీఢ్య కార్యక్రమం చేసి అన్నప్రసాదం ఏర్పాటు చేశామని తెలిపారు. మంగళవారం నాడు జాతర మహోత్సవం అదే విధంగా కుస్తీపోటీలు నిర్వహించమని ఈ పోటీలో పాల్గొనేందుకు మహరాష్ట్ర, కర్ణాటక రాష్ట్ర మల్లయోధులు పోటీలో పాల్గొన్నారని చివరి కుస్తీ పోటీలో గెలుపొందిన యోధుడికి ఐదు తులాల వెండి కడియం బహుమతి ఇచ్చి సత్కరించడం జరిగిందని కమిటీ అధ్యక్షుడు మద్దూరి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు అశోక్, గ్రామ పెద్దలు, కార్యవర్గ సభ్యులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


మహిళలతో కుస్తీ పోటీల్లో పాల్గొన్న పురుషుడు


చెరువులో నుంచి మట్టిని తరలిస్తున్న దృశ్యం


నర్సింగ్‌పల్లిలో టిప్పర్లను నిలిపివేసిన గ్రామస్థులు

# అధికార పార్టీ నాయకుల మధ్య నల్లమట్టి వార్

● మోపాల్‌లో చర్చనీయాంశమైన నల్లమట్టి తరలింపు

మోపాల్, మే 13 (ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ నాయకుల మధ్య చెరువుల మట్టి తరలింపులో వార్ మొదలైంది. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ప్రధాన అనుచరులుగా ఉన్న ఇద్దరు నాయకుల మధ్య ఈ వార్ తీవ్రస్థాయికి చేరుకోవడంతో మండలంలో చర్చనీయాంశమైంది. మొన్నటి వరకు మొరం తరలింపు, ఇప్పుడు చెరువులో ఉన్న నల్లమట్టిని తరలించేందుకు ఆ పార్టీ నాయకులు పోటాపోటీ పడుతున్నారు. ఈ ఇద్దరు నాయకులు నువ్వెంత అంటే నువ్వెంత అంటూ టిప్పర్లను అధిక మొత్తంలో దింపి చెరువులో మట్టిని ఇటుకబట్టీలకు తరలిస్తున్నారు. విషయాన్ని తెలుసుకున్న సంబంధిత అధికారులు తరలింపును అడ్డుకోవడంతో తాము అనుమతులతో మట్టిని తీస్తున్నామని తమను ఎవరూ అడ్డుకోవద్దని అధికారులకు బెదిరింపులు చేయడంతో అటువైపు అధికారులు కన్నెత్తి చూడలేకపోతున్నారని మండలంలో చర్చనీయాంశమైంది. గతంలో బీఆర్ఎస్ నాయకులు ఇదే విధంగా మొరం, మట్టిని తరలించిన విషయం ఈ పార్టీ నాయకులకు తెలియడంతో పోటాపోటీగా టిప్పర్లను పెట్టి మంచిప్ప, నర్సింగ్‌పల్లి, సిర్పూర్, మోపాల్ చెరువులో నుంచి మట్టిని తరలిస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి టిప్పర్లు వెళ్లడంతో ఆయా గ్రామాల వీడీసీ పెద్దలు టిప్పర్లను అడ్డుకుంటున్నారు. తమ గ్రామాభివృద్ధికి ఏదైనా ఇస్తే గ్రామం నుంచి టిప్పర్లను తిరగనిస్తామని అప్పటి వరకు గ్రామ పొలిమేర దాటనివ్వమని హెచ్చరిస్తూ టిప్పర్లను ఆయా గ్రామాల ప్రజలు ఆపివేయడంతో ఏదో కొద్దిగా డబ్బులను ముట్టజెప్పి టిప్పర్లను తీసుకెళ్తున్నారు. ఆయా చెరువుల నుంచి మట్టి తరలింపు దారిలో గ్రామాలు ఎక్కువ ఉండడంతో అడుగడుగునా గ్రామస్తులు టిప్పర్లను తిరగనీయకుండా అడ్డుకుంటున్నారు. దీంతో ఆ నాయకులకు తలనొప్పిగా మారడంతో సంబంధిత అధికారులచే అనుమతులు తీసుకుని మట్టి తరలింపునకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇకనుంచి ఎవరైనా టిప్పర్ల ను అడ్డుకుంటే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆ యా గ్రామాల వీడిసి పెద్దలకు నాయకులు హెచ్చరించినట్లు సమా చారం. నల్లమట్టి తరలింపులో ఇద్దరు నాయకుల మధ్య వార్ మొదలైందని గుసగుసలు వినిపించడంతో మండలంలో చర్చనీయాంశమైంది. నాయకుల మధ్య నెలకొన్న ఈ వార్ ఎమ్మెల్యే దృష్టికి ఇంకా చేరిందోలేదోనని ఇతర నాయకులు చర్చించుకుంటున్నారు.

## టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడిగా భీంరావు



లింగంపేటలో నూతనంగా ఎన్నికైన టీడీపీ మండల కార్యవర్గం

లింగంపేట,మే 13 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడిగా ఎల్లమ్మతండా మాజీ సర్పంచ్ భీంరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు టీడీపీ జహీరాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పైడి గోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం లింగంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో ముఖ్య అథితిగా పాల్గొన్న గోపాల్‌రెడ్డి జహీరాబాద్ పార్లమెంట్‌లో టీడీపీ జెండా ఎగురవేసి టీడీపీకి పూర్వ వైభవం తీసుకువస్తామని జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలలో 2028ఎన్నికల్లో పోటీ చేసి అన్ని స్థానాలను కైవసం చేసుకుంటామని అందుకుగాను పార్టీని గ్రామస్థాయినుంచి బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలియజేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ నుంచి అభ్యర్థులను బరిలో దించుతామని తెలంగాణలో గ్రామ గ్రామానా బలమైన టీడీపీ కార్యకర్తలు ఉన్నారని ఆయన తెలిపారు. లింగంపేట మండలంలో ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ఆయన ప్రకటించారు. అధ్యక్షుడిగా భీం రావు, ఉపాధ్యక్షుడిగా విశ్వేశ్వరశర్మ, వడ్లకృష్ణ, మండల కార్యదర్శిగా కాశీరాం, జిల్లాకార్యవర్గ సభ్యులుగా రామలింగంగౌడ్, కొమ్ముల లక్ష్మినారాయణ, సలహాదారులుగా యాదగిరి, జగ్యానాయక్, కమ్మరి రాజు, శంకర్, సాయిబాబ, అజయ్‌కుమార్, నారాయణలను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

## రాజీవ్ యువ వికాస్ పథకాన్ని నిబంధనలు లేకుండా ఇవ్వాలి




మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

రామారెడ్డి, మే 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ రాజీవ్ యువ వికాస్ పథకాన్ని నిబంధన లేకుండా అందరికీ అమలుపరచాలని రామారెడ్డి మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి పేర్కొన్నారు. రామారెడ్డి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పడగెల శ్రీనివాస్ గుప్తాతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ యువ వికాస్ అనే పథకాన్ని నిరుద్యోగ యువతీ, యువకులకు 50 వేల నుండి నాలుగు లక్షల వరకు సబ్సిడీపై ఇవ్వడం జరుగుతున్నదని అందరితో దరఖాస్తులను పరిశీలించారు. అందరూ ఆశతో వ్యయా ప్రయాసలకు ఓర్చుకొని దరఖాస్తులు చేసుకున్న తర్వాత రాష్ట్ర ప్రభుత్వము ఎవరికైతే సిబిల్ స్కోర్ ఉంటేనే వారికి ఇవ్వడం జరుగుతుందని చెప్పడం ఎంత వరకు సమంజసమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల ప్రధాన కార్యదర్శి ల్యాగల మైపాల్, నాయకులు బాల్దేవ్ అంజన్న, కట్లకుంట సుధాకర్,లింగం, పూసల లింగం, కమ్మరి గాయత్రి ప్రసాద్, కిషన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దళారులుగా అవతారం ఎత్తిన రైస్‌మిల్లర్లు

● సొసైటీ అధికారులతో కుమ్మక్కు ● రైతులకు సమాచారం లేవి వరిధాన్యంలో కోత



రైతులకిచ్చిన ట్రక్‌షీట్ వివరాలు



వెయిట్ లాస్ పేరుతో ధాన్యం బస్తాలకు ఇచ్చిన బిల్లు

మహమ్మద్‌నగర్, మే 13(ఆంధ్రజ్యోతి): ఒకవైపు అకాలవర్షాలు రైతులకు అడుగడుగున కష్టాలను తెచ్చిపెడుతుంటే మరోవైపు రైస్‌మిల్లర్లు రైతులను పూర్తిగా ముంచే ప్రయత్నాలుచేస్తున్నారు. మండలంలోని గున్కల్ సొసైటి పరిధిలో నర్వ, మహమ్మద్‌నగర్, గున్కల్, బూర్గుల్, తుంకిపల్లి, సింగితం సెంటర్లతో పాటు మిగితా గ్రామాలలో ఐకేపీ సెంటర్లు ఆరు నడుస్తున్నాయి. కేంద్రాలకు రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని కొనుగోలుచేస్తున్న సొసైటి అధికారులు రైస్‌మిల్లర్లతో కుమ్మకై రైతులను మోసం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెన్ను పట్టని ధాన్యమే కాకుండా చెన్ను పట్టిన ధాన్యాన్ని కూడా ఒక బస్తాకు రెండు కిలోల చొప్పున తరుగు తీసేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇది ఇలా ఉంటే వెయిట్‌లాస్ పేరుతో అదనంగా ఒక లారీకి 10 నుంచి 16 ధాన్యం బస్తాలను కోత విధిస్తున్నారని వాపోతున్నారు. రైస్‌మిల్లర్‌లో ఉండాల్సిన ధర్మకాంటా రైతులకు కనపడకుండా చేస్తున్నారు. డిస్‌ప్లే తొలగించి వారి సిస్టంకు కనెక్ట్ చేయడంతో రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ధాన్యం బస్తాలను తరుగుపేరిట దోచుకుంటున్నారు. ఇదేమిటని రైతులు రైస్‌మిలర్ల యాజమానులతో మొరా పెట్టుకుంటే మీ సొసైటిలో మాట్లాడుకోమని సమాధానం ఇస్తున్నారు. ఇదే విషయాన్ని సొసైటి సీఈవోను అడిగితే తమకేమి తెలియదని అక్కడే ఏదో ఒక రకంగా మాట్లాడుకోని రావాలని పేర్కొంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.ఈ పరిస్థితుల్లో తాము ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని టోల్ ఫ్రీ నంబర్ ఉన్న ఫలితం లేకుండా పోయిందని ఉన్నతాధికారులైన స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

## భిక్కనూరులో అమ్మఒడి కార్యక్రమం



భిక్కనూరులో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

భిక్కనూరు,మే 13(ఆంధ్రజ్యోతి):భిక్కనూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అమ్మఒడి కార్యక్రమాన్ని నిర్వ హించారు.ఈ సందర్భంగా వైద్యురాలు దివ్య గర్భిణీలకు పరిక్షలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. గర్భిణులు తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో వెంకట రమణ, సిబ్బంది, ఆశాలు, పాల్గొన్నారు.

## నేడు బస్వాపూర్‌లో ఉపాధిహామీ సామాజిక తనిఖీ

భిక్కనూరు, మే 13(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించడం జరుగుతుందని గ్రామ పంచాయతీ కార్యదర్శి దయాకర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే ఈ గ్రామసభకు గ్రామస్థులు సకాలానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## నేడు లింగంపేట మండలంలో ఎమ్మెల్యే పర్యటన

లింగంపేట,మే 13(ఆంధ్రజ్యోతి):లింగంపేట మండలంలోని బాణాపూర్, ఒంటర్‌పల్లి గ్రామాలలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనల్లో పాల్గొంటారని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్ తెలిపారు. మండలంలోని బాణాపూర్ సబ్‌స్టేషన్‌లో రూ.కోటితో నూతనంగా ఏర్పాటు చేసిన పీటీఆర్‌ను ప్రారంభిస్తారని, అనంతరం మండలంలోని ఒంటర్ నుంచి గట్టు మైసమ్మ తండావరకు బీటీ రోడ్డు పనులను శంకుస్థాపన చేస్తారని ఆయన తెలిపారు.కార్యక్రమానికి మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తలు తరలి రావాలని ఆయన కోరారు.

# మద్నూర్‌లో పోటాపోటీగా కుస్తీ పోటీలు



మల్లయోధులకు బహుమతులు అందజేసిన జుక్కల్ ఎమ్మెల్యే



గున్కుల్ పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

మద్నూర్, మే 13 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ ఆలయం రథోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం గోశాలలో నిర్వహించిన కుస్తీ పోటీలు ఆసక్తి రేపాయి. కుస్తీ పోటీ జరుగుతున్న సమయంలో చివరి వరకు ఎవరు గెలుస్తారన్నది కుస్తీ పోటీలను తిలకిచ్చేందుకు వచ్చిన వారు ఎదురు చూస్తూ ఆశ్చర్యానికి లోనయ్యారు. జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు సైతం కుస్తీ పోటీలకు ముఖ్య అథితిగా ఆహ్వానించారు. ఆయన ఈ పోటీలను ఆసక్తిగా తిలకించారు. కుస్తీ పోటీలకు పాల్గొనడానికి గాను మహారాష్ట్రలోని తుల్జాపూర్, దెగ్లూర్, తదితర గ్రామాలతోపాటు తెలంగాణలోని అంతాపూర్ గ్రామం నుంచి వచ్చిన మల్లయోధులు తలపడ్డారు. గెలుపొందిన వారికి రూ. 5,001 నగదు బహుమతిని అందజేశారు. ఈసందర్భంగా జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ కనుమరుగు కాకుండా లక్ష్మీనారాయణ మందిరం నిర్వాహకులు కుస్తీ పోటీలను నిర్వహిం చడం పై అభినందించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీర దారుఢ్యానికి ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని సూచించారు. కుస్తీ పోటీల్లో పాల్గొన్న మల్ల యోధులకు అభినందించి వారికి శుభాకాంక్షలు తెలి పారు. ఆయనతో పాటు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, నాయకులు, గ్రామ పెద్దలు ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

● భక్తి శ్రద్ధలతో రథోత్సవ ఊరేగింపు

మండల కేంద్రంలో ఆనవాయితీగా వస్తున్న రథోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. మండల కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి నుంచి రథయాత్ర కార్యక్రమం ప్రారంభమైంది. రథయాత్రకు ముందు లక్ష్మీనారాయణ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథయాత్ర ఊరేగింపు జయ జయ ధ్వనాలతో మారుమ్రోగింది. రథానికి కట్టిన తాళ్లతో భక్తులు రథాన్ని కదిలించారు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా రథాన్ని ఊరేగించారు. ముందుగా ఆలయంలో జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు స్వామివారి దీవెనలు నియోజకవర్గం ప్రజలపై ఉండాలని ప్రజలు పాడి పంటలతో ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని స్వామిని వేడుకొన్నట్లు తెలిపారు. రథోత్సవ కార్యక్రమంలో మహారాష్ట్ర కర్ణాటక తెలంగాణ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. వారికి జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్‌లు అన్న ప్రసాద వితరణ కార్య క్రమం ఏర్పాటు చేశారు. రథోత్సవ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

● ఎల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

**మహమ్మద్‌నగర్:** మహమ్మద్‌నగర్ మండలంలోని గున్కుల్ గ్రామంలో శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ప్రత్యేక పూజలునిర్వహించారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన,కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మం డల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గంగి రమేష్, సొసైటి వైస్ చైర్మన్ నర్సింలు, సాయాగౌడ్, నారాగౌడ్, సంతోష్‌రాథోడ్ తది తరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాలి

తాడ్వాయి, మే 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చాలని సంకల్పంతో మండలంలోని నిరుపేద అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ళను త్వరగా పూర్తి చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి రాజారాం అన్నారు. ఈయన మండలంలోని దేవయ్యపల్లి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ళకు మార్కౌట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ళను నాణ్యతతో పూర్తి చేయాలని తెలిపారు. త్వరలోనే అన్ని గ్రామాల్లో మొదలు పెడతామని అన్నారు. మొదటి విడతగా గ్రామాల్లోని నిరుపేదలకు ఇళ్లను అందజేస్తామని తెలిపారు. అలాగే ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఇల్లు వచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఇందులో మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజిద్ అలీ, ఎంపిఒ సవితారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు జూకంటి వెంకటరెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు గైని శివాజీ, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.



దేవాయిపల్లిలో ఇందిరమ్మ ఇంటికి మార్క్ అవుట్ ఇస్తున్న ప్రత్యేక అధికారి

# వ్యవసాయ మోటార్లను దొంగిలించిన దొంగల అరెస్టు

నాగిరెడ్డిపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండలంలో వరుస వ్యవసాయ మోటార్ల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వ్యవసాయ మోటార్ల దొంగతనం కేసు వివరాలను వెల్లడించారు. మండలంలోని మాల్తుమ్మెద, పోచారం తదితర గ్రామాల శివారు పంట పొలాల నుంచి తరచూ వ్యవసాయ మోటర్లను దొంగలు దొంగిలించుకుపోతున్నారని రైతుల ఫిర్యాదు మేరకు వ్యవసాయ మోటార్ల దొంగతనం పైన ప్రత్యేక దృష్టిని సారించమన్నారు. మండలంలోని మాల్తుమ్మెద గ్రామానికి చెందిన పోతరాజు రాములు అలియాస్ తుకారం, ఈటల శ్రీనివాస్ ఇద్దరు దొంగల్ని పట్టుకొని వారిని విచారించినట్టు , ఈ ఇద్దరు కలిసి 18 వ్యవసాయ మోటార్లను దొంగిలించినట్టు ఆయన తెలిపారు. అందులో ఆరు వ్యవసాయ మోటార్లను వారి వద్దనుంచి స్వాధీనం చేసుకున్నట్లు వాటి విలువ సుమారు 70 వేల రూపాయల వరకు ఉంటుందన్నారు. వీరి నుంచి ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఇద్దరు దొంగలు దొంగిలించిన వ్యవసాయ మోటర్లను మాల్తుమ్మెద గ్రామానికి చెందిన బోయిని సత్యం వీరి వద్ద నుంచి మోటార్లను కొనుగోలు చేసినట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై మల్లారెడ్డి, ఏఎస్సై ఉమేష్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



నాగిరెడ్డిపేటలో కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎల్లారెడ్డి సీఐ

## వైద్య సిబ్బంది స్థానికంగా ఉంటూ సేవలు అందించాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో దివ్య



రికార్డులను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో దివ్య

బీర్కూర్,మే 13 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది స్థానికంగా ఉంటూ ప్రజలకు సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దివ్య వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రికి సంభందించిన రికార్డులను, సిబ్బంది హాజరు పట్టిక, రోగుల రిజిస్టర్‌లను పరిశీలించారు.వైద్య సిబ్బంది స్థానికంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రవీందర్, ఎంఎల్‌హెచ్‌పీలు శ్రీలత, ప్రీతి, తదితరులు ఉన్నారు.

## నల్లమడుగులో ఘనంగా రథోత్సవం

లింగంపేట,మే13(ఆంధ్రజ్యోతి):మండలంలోని నల్లమడుగులో మంగళ వారం పోచమ్మకు ఘనంగా రథోత్సవం నిర్వహించారు.అమ్మ వా రికి ప్రత్యేక పూజలు చేశారు. వచ్చే వర్షాకాలంలో మంచి వర్షాలు పడి గ్రా మం పాడి పంటలతో అభివృద్ధి చెందాలని భక్తులు అమ్మవారిని వేడుకు న్నారు. ఉత్స వంలో చిన్న పిల్లలు పెద్దలు అంతా ఉత్సాహంగా భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.

## బడీడు పిల్లలు బడిలోనే ఉండాలి

మాచారెడ్డి, మే 13(ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలు బడిలోనే ఉండాలని పాల్వంచ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బడిబాట కార్య క్రమంలో బాగంగా గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులతో మంగళ వారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పిల్లలందరూ చదువుకునేలా మహిళలు కృషిచేయాలన్నారు. విద్యార్థులు మధ్యలో చదువు ఆపరాదని తప్పకుండా పాఠశాలకు పంపించాలన్నారు. ప్రతివిద్యార్థి పాఠశాలకు హాజర య్యే విధంగా కృషి చేయాలన్నారు. గ్రామంలో మధ్యలో చదువు మానేసి ఇంటివద్ద ఉండే పిల్లలను గుర్తించి బడిలో చేర్పించే విధంగా కృషిచేయాల న్నారు. పిల్లలను ఎవరు పనికి పంపించరాదన్నారు. ఈ సందర్భంగా బడిబాట కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మాజీ మున్సిపల్ చైర్మన్ కుటుంబ సభ్యులకు పరామర్శ

ఎల్లారెడ్డి,మే13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ నానమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మంగళవారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించి మనో ధైర్యం కల్పించారు. ఆయనతో పాటు మండల అధ్యక్షుడు సాయిబాబా, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశాంత్, తిరుపతి, అల్లం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి

బీర్కూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మంజీరా నది వారధి సమీపంలో సోమవారం రాత్రి కారు, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన శివనూర్ సంతోష్ (32) అనే గొర్రెల కాపరి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం, బీదర్ జిల్లా, ఔరాద్ తాలూకా, నండియాల్ గ్రామానికి చెందిన శివనూర్ సంతోష్ , బసగొండ లు గొర్రెల కాపరులు. గత మూడు రోజుల క్రితం గొర్రెలను మేపడానికి గొర్రెలను తీసుకుని కోటగిరి మండలం కొత్త పల్లి గ్రామానికి వచ్చారు. అయితే గొర్రెలను గ్రామంలో ఒక వ్యక్తికి అప్పగించారు. సోమవారం రాత్రి సంతోష్, బసగొండలు ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలు దేరారు. ఈ క్రమంలో బీర్కూర్ మంజీరా నది సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో బసగొండకు స్వల్ప గాయాలు కాగా, సంతోష్‌కు కాళ్ళు చేతులు విరిగిపోయాయి, తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. అటుగా వెళ్తున్న వారు 108కు ఫోన్ చేశారు. అంబులెన్స్‌లో ఇద్దరిని బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు నిజామాబాద్‌కు రిఫర్ చేశారు. మార్గ మధ్యంలో సంతోష్ మృతి చెందాడు. బస గొండ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి భార్య అంబిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## ఆర్థిక చేయూతతో పాటు నైపుణ్య శిక్షణ



కుట్టు మిషన్లను అందజేస్తున్న దృశ్యం.

సదాశివనగర్, మే 13(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్థిక చేయూతతో పాటు నైపుణ్య శిక్షణ ఇచ్చి, మహిళలు తమ కాళ్లపై నిలబడేలా చేయ్యడమే తమ సంస్థ ఉద్దేశ్యమని గ్రామస్వరాజ్యం సంస్థ కోఆర్డినేటర్ భానుప్రియ అన్నారు. మంగళవారం మండలంలోని కుప్రియాల్ గ్రామంలో గ్రామ స్వరాజ్యం సంస్థ, ఎస్‌బీఐ ఆధ్వర్యంలో మహిళలకు 30రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శిబిరం ముగిం పు కార్యక్రమాన్ని నిర్వహిం చి శిక్షణ పత్రాలను అందజేశారు. ఆసందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్ర మాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఎస్బీఐ సహాయంతో రూ.12వేల విలువ కలిగిన కుట్టు మిషన్‌ను అంద జేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీ ఆంజనేయులు, సంతోష్‌రెడ్డి, నాగ రాజు, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ సెక్రటరీలు సమయపాలన పాటించాలి



బొప్పాస్‌పల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి దయానంద్

నసురుల్లాబాద్,మే 13(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఆయాగ్రామాలకు చెందిన పంచాయతీ సెక్రటరీలు సమయపాలన పాటించాలని మండల ప్రత్యేక అధికారి దయానంద్ అన్నారు. మంగళవారం మండలంలో ని బొప్పాస్‌పల్లి గ్రామంలో నర్సరీని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలో పెరిగే మొక్కలను కోతుల బెడద నుంచి తప్పించ డానికి ఫిష్ నెట్‌ను ఏర్పాటు చేయాలని, అదేవిధంగా నర్సరీలో కోతుల బెడద వల్ల పాడై పోయిన మొక్కల స్థానంలో కొత్తవి రీప్లేస్ చేయాలని అన్నారు. ఆయన వెంట ఎంపీవో వెంకటరమణ, ఏపీవో సౌజన్య, టెక్నికల్ అసిస్టెంట్ బలరాం, పంచాయతీ సెక్రెటరీ సుధాకర్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా మార్కండేయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



కలశాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న మహిళలు

గాంధారి,మే 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నారాయణగిరి వద్ద వైభవంగా శివభక్త మార్కండేయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం సంఘం భవనం నుంచి మహిళ భక్తులు ఏకరూప దుస్తువులు ధరించి కళాశాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా మార్కండేయ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం యాగసంకల్పం, వేదమంత్ర పారాయణం,ఫల,పుష్పం, ఆదివాసములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం, భజన కార్యక్రమాలు చేపట్టారు.

## ధాన్యం తూకంలో తేడా రావద్దు : అదనపు కలెక్టర్

లింగంపేట,మే 13(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తూ కంలో తేడా రావొద్దని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. మంగళవారం ఆయన కోమట్‌పల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకంనుపరిశీలించారు. తూకంలో వ్యత్యాసం రాకుండాచూడాలని హమాలీలనుఆయనఆదేశించా రు. వాతావరణ శాఖ సమాచారం మేరకు అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు ధాన్యం కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పి ఉంచాలని ఆయన తెలిపారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచుకోవాలని రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో దాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు రైతులు ఉన్నారు.

## కొచ్చేరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



నసురుల్లాబాద్,మే 13 (ఆంధ్రజ్యోతి): మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చేరి మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్త లు ప్రత్యేకపూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మెక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం కొచ్చేరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహా పంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

రామారెడ్డి, మే 13 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసినట్లు మండల కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్ గౌడ్ తెలిపారు. రామారెడ్డి మండలం గోకుల్ తండా, గొల్లపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు చెక్కులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో విండో వైస్ ఛైర్మెన్ అమ్ముల పశుపతి శర్మ, ఎఎంసి డైరెక్టర్లు ఎండి. రావుఫ్, బట్టు సత్యనారాయణ, పోసానిపేట్ గ్రామ అధ్యక్షులు నరేందర్. కన్నాపూర్ అంజల్ రెడ్డి, గొల్లపల్లి కిషన్ యాదవ్, ఇసన్నపల్లి గ్రామ అధ్యక్షులు లింగం, మహిళా అధ్యక్షురాలు దండబోయిన అంజవ్వ, మండల ఉపాధ్యక్షులు తూర్పు రాజు, శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకులు బండి ప్రవీణ్, నామాల రవి, బండి పోచయ్య, జెసిపి శేఖర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అద్నన్, నాయకులు లింబాద్రి, హరీష్, కటికె సాయి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లింగంపేటలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

లింగంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ కార్యకర్తలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్దీదారులకు ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. మొత్తం రూ.174500 చెక్కులను మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్ చేతుల మీదుగా లబ్దీదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్, నగేష్, రాజు, కిరణ్, అశోక్, లక్ష్మీనారాయణతో పాటు నాయకులు ఉన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

ఎల్లారెడ్డిరూరల్,మే 13(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలంలోని జంగమయ్యపల్లి గ్రామంలో వేరువేరు కారణాలతో అనారోగ్యానికి గురైన బాధితులకు మంగళవారం ఏఎంసీచైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన కురుమసాయిలు పాముకాటుతో ఎల్లారెడ్డిపేట ఆసుపత్రిలో చికిత్స పొందాడని అతనికి రూ.46 వేలు, అలాగే నాయకోటి ఎల్లయ్య పక్షవాతం రావడంతో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందాడని అతనికి రూ.28 వేల చెక్కులను అందించామని తెలిపారు.

## సినిమా గైడ్ కామారెడ్డి



| కామారెడ్డి | |
|---|---|
| దర్శన్ | - శుభం |
| ప్రియా 70 | - జగదేక వీరుడు అతిలోక సుందరి |
| ప్రియా 35 | - సింగిల్ |

| బాన్సువాడ | |
|---|---|
| మహేశ్వరి | - హిట్ 3 |
| వెంకటేశ్వర | - సీఎం పెళ్లాం |

## చికెన్ ధరలు



| రకం | : | లైవ్ | విత్‌స్కిన్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|---|
| సుగుణ (కిలో) | : | 110 | 150 | 180 |
| వెన్‌కాబ్(కిలో) | : | 130 | 160 | 190 |

